# మంచి వార్త



## వైద్యో నారాయణో హరిః

**చాలామంది** డాక్టర్లకు రోగుల ప్రాణాల కంటే స్వీయ ప్రయోజనాలే ముఖ్యం. ఇలాంటి రోజుల్లో అంకితభావంతో వైద్యం చేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో తామే ఆర్థికంగా సాయం అందిస్తున్న వైద్యులూ అక్కడక్కడా కనిపిస్తారు. సూర్యాపేట జిల్లా మటంపల్లి మండలానికి చెందిన డాక్టర్ శ్రీహరిరావు నూటికి నూరుపాళ్లు అలాంటి వైద్యుడే. ఆయన మటంపల్లి నాగార్జున సిమెంట్స్ ఆవరణలో ఉన్న రామచంద్ర రాజు మెమోరియల్ హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్నారు. మారుమూల గ్రామాల నిరుపేదలు కూడా ఏ సమస్య ఎదురైనా ఆయన్ని వెతుక్కుంటూ వస్తారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చాలావరకు ఉదయం తొమ్మిది గంటల  నుంచి సాయంత్రం నాలుగింటి వరకే పని చేస్తాయి. కాబట్టి, గ్రామీణుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీహరి రావు తన క్లినిక్‌లో నిరంతరం అందుబాటులో ఉంటారు. ''ఇది గుట్టలు, అడవులతో నిండిన ప్రాంతం. పాముకాట్లు, తేలుకాట్లతో ప్రజలు మా హాస్పిటల్‌కు రావడం చాలా సహజం. సంవత్సరానికి యాభై వరకూ ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి'' అంటారాయన. ఇక రోజువారీగా మటంపల్లి మండలానికి చెందిన 30 గ్రామాల నుంచి 100 మందికిపైగానే వివిధ రుగ్మతలకు చికిత్స కోసం వస్తుంటారు. అందుకే వివిధ వైద్య విభాగాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు శ్రీహరి. నెలలో ఒకసారి కంటివైద్యులు, గైనకాలజిస్టు, పీడియాట్రీషియన్ వచ్చి పరీక్షలు చేస్తుంటారు. గుండెజబ్బుల నిపుణులు మూడు  నెల్లకోసారి దవాఖానను సందర్శిస్తారు. తరచూ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతీ నెలా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అవసరమైన వారికి మందులు ఇస్తారు. రక్తదాన శిబిరాలను కూడా నిర్వహిస్తారు. అలా ఈ ఏడాది 18 రక్తదాన శిబిరాల ద్వారా 1,366 యూనిట్ల రక్తం సేకరించారు. ఇక్కడ అందుబాటులో లేని సేవల కోసం రోగులను అంబులెన్సులో హైదరాబాద్ తరలించే ఏర్పాట్లూ ఉన్నాయి. కాబట్టే, స్థానికులు శ్రీహరి రావును దేవుడిలా చూస్తారు.

## వైతాళికుల వాణి

కూర్చోకండి. వేచి చూడకండి.
ఉన్నచోటు నుంచి కదలండి.
జీవితాన్ని అనుభూతి చెందండి.
సూర్యుణ్ని తాకండి.
సముద్రంలో మునకలు వేయండి.

• **జలాలుద్దీన్ రూమీ**
**(సూఫీ కవి, మార్మికుడు)**

## క్యా బాత్‌హై!



**బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్‌లో కర్ణాటక గ్రామీణ క్రీడ.. 'కంబళ' పోటీలకు సిద్ధం అవుతున్న ఓ రైతు.**